# ఆనందమే అందం

సాయంత్రం అయిదు గంటలయింది. ఎండ తీవ్రత ఇంకా తగ్గలేదు. వాహనాల రద్దీ పెరిగింది. రోడ్లన్నీ హడావిడిగా ఉన్నాయి. లైబ్రరీలో కూర్చుని పేపర్లన్నీ చదవడం ముగించి లేచాడు రామారావు. భార్యకోసం తీసుకున్న పుస్తకం కార్డు మీద ఎంట్రీ చేయించి ఇంటికి బయలుదేరాడు.

ఆయన కోసమే ఎదురు చూస్తోంది జానకమ్మ. ఇద్దరూ కలిసి కాఫీ తాగారు. ఆ తర్వాత కార్యక్రమం మొక్కలకి నీళ్ళు పోయడం. ఇద్దరూ సాయం పట్టి కబుర్లు చెప్పుకుంటూ నీళ్లు పోశారు. మల్లెమొక్క నిండా మల్లెమొగ్గలే. ఇంట్లోంచి పళ్ళెం తీసుకొచ్చి మొగ్గలు కోయసాగింది జానకమ్మ. అప్పుడే కాలేజీ నుంచి వచ్చిన పక్కింటమ్మాయి పలకరించే సరికి కబుర్లలో పడ్డాడు రామారావు. "ఏమిటమ్మా కాలేజీ విశేషాలు?" అని అలవాటుగా అడిగాడు. "ఏమిలేవు బాబాయిగారు" అంది సుధ. "ఏమిటమ్మా ఇది? ఏపూట కాపూట ఏదైనా తాజావార్త వినిపిస్తావేమోనని చూస్తుంటే ఏమి లేదంటున్నావ్. మండల్ కమిషన్ గొడవ అయిపోయి చాలరోజు లైపోయిందికదా మళ్ళీ స్ట్రయికూ గట్రా చేసే ఆలోచనేం లేదా?" అన్నాడు.

"చెయ్యాలని మాకు సరదాగానే ఉందండీ. కానీ, కారణం దొరకద్దూ!"

"మీరు కావాలంటే కారణమే దొరకదా! ఏదో ఒకటి చూసుకుని త్వరగా స్ట్రయిక్ మొదలెట్టండి మరి కాలేజీలు మూసేస్తే చక్కగా మనిద్దరం చెస్ ఆడుకోవచ్చు" సరదా పడ్డాడు ఆయన.

"ఓ అలాగే మీ ఆశీర్వాదం ఉండాలే కానీ అదెంతసేపు" హామీ ఇచ్చేసి నవ్వుతూ లోపలకి వెళ్ళిపోయింది సుధ.

భార్యకి మొగ్గలు కోయడంలో సాయం చేసి, ఆవిడతో ఇంట్లోకి వెళ్ళి పక్కనే కూర్చుని లైబ్రరీలో జరిగిన వింతలూ, విశేషాలూ చెబుతూ కూర్చున్నాడు. కబుర్లు

చెప్పకుంటూ ఉండగానే విమానం వచ్చి ఆగిన శబ్దం అయింది. "అబ్బాయి వచ్చాడు" లేచి లోనికి వెళ్ళింది జానకమ్మ.

స్కూటర్ స్టాండ్ వేసి లోపలికి వచ్చాడు మనోహర్, ఏమిటి నాన్నా విశేషాలు? ఉత్తరాలేమైనా వచ్చాయా? వీడు స్కూలుకి వెళ్ళాడా? వచ్చి తండ్రి పక్కన కూర్చున్నాడు.

ఉత్తరాలు ఏమీ రాలేదురా. వీళ్లిద్దరూ మూడు గంటలకే స్కూల్‌కి వెళ్ళారు. ఇంకేం లేవు విశేషాలు. అదిసరే, ఇవాళ ఇంత ఆలస్యం అయిందేం? అన్నాడు రామారావు.

మనోహర్ మొహం చిరాగ్గా మారిపోయింది.

"ఈ కరెంటు వాళ్ళతో మా చెడ్డ చిరాగ్గా ఉంది నాన్నా. రోజూ మధ్యాహ్నం మూడయ్యేసరికి ఠంచనుగా కరెంటు పోతుంది కదా! ఇవాళ ఎంతకీ పోదే. అప్పటికీ అన్నీ సర్దేసుకుని లైట్లవంకే చూస్తూ కూర్చున్నాం. దాని మొహం మండ-పావు తక్కువ అయిదైనా ఇంకా లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. అయిదింటికిదాకా అక్కడే కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం" విసుగ్గా చెప్పాడు మనోహర్.

అతగాడి ఆఫీసు ఒక పురాతన కట్టడంలో మధ్యలో ఉంది. గుహలోకి దూరిపోయినట్లు సందులూ గొందులూ తిరిగి లోపలికి పోవాలి. పట్టపగలు కూడా కటిక చీకటి. కన్ను పొడుచుకున్నా కనిపించదు. పూర్తిగా కరెంటు దీపాలమీదే ఆధారం. ప్రతిరోజూ మూడయ్యేసరికి కరెంటు పోతుంది. అందుకని ముందు జాగ్రత్తగా రెండు కొట్టేసరికి ఫైళ్ళు కట్టేసి రెడీ అయిపోతారు స్టాఫ్ అంతా. కరెంటు పోగానే లేచి ఓ పావుగంట అక్కడా ఇక్కడా తచ్చాడి ఇళ్ళకి వెళ్ళిపోతారు. మరి అలాంటిది కరెంటు పోకపోతే!

"నా తండ్రే! ఎంత కష్టం వచ్చింది నాయినా నీకు?" పరామర్శించాడు రామారావు.

"కష్టంలో కాస్తా అయినా, గంటల తరబడీ ఆఫీసులో కూర్చోవాలంటే విసుగెయ్యదూ! వెధవది- క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం అయినా బాగుండును- కాస్త కాలక్షేపం" కాఫీ అందుకుంటూ మొరపెట్టుకున్నాడు.

కొడుక్కి కాఫీ ఇచ్చి మల్లీ పూలు కట్టడానికి కూర్చుంది జానకమ్మ.

"పేపర్లు చూశారా నాన్నా. ఏదైనా కనిపించిందా?" అడిగాడు మనోహర్. అతని తమ్ముడు దినకర్ డిగ్రీ పూర్తిచేసి ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేసేవాడు. అది కాస్తా అంతక్రితం రోజే ఊడిపోయింది. ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాడు. అతని

ఉద్యోగం కోసం ప్రయత్నాలు గట్టిగానే సాగిస్తున్నారు. ప్రతిరోజూ లైబ్రరీకి వెళ్ళి ఒకటికి నాలుగు పేపర్లు తిరగేసి చూసి వస్తాడు రామారావు. ఎవరినైనా పట్టుకుని ఎవరిద్వారా నైనా, ఎవరికైనా ఏదైనా చేతులలో పెట్టి పని జరిపించాలని ప్రయత్నం చేస్తున్నాడు మనోహర్. ఇంకా ఏదీ కుదరలేదు.

"వాడికి పనికొచ్చేదేం కనిపించలేదు. కానీ, అబ్బాయ్! ఓ కంపెనీలో జనరల్ మేనేజర్ పోస్ట్ కోసం మనిషి కావాలని వేశార్రా. జీతం నెలకు ఏడువేలు, కారు, ఫర్నిష్డ్ ఇల్లు. ఇంకా బోలెడన్నీ సౌకర్యాలు."

"నెలకి ఏడు వేలే, అదికాక ఇల్లూ కారూనా? ఓయమ్మో!" సంభ్రమంగా అడిగింది జానకమ్మ.

భార్య వంక సూటిగా చూశాడు రామారావు.

"పోనీ నీ పేర ఓ అప్లికేషన్ వేయమంటావా?"

సీరియస్‌గానే అడిగాడు. ఆవిడేం తక్కువ తినలేదు.

"పోనీ వేసి చూడండి. డిగ్రీలూ బొగ్రీలూ లేవుకానీ, మేనేజ్‌మెంట్ చెయ్యడానికేం– దివ్యంగా చేస్తాను. మనింటినే మేనేజ్ చేయగాలేనిది ఫ్యాక్టరీని చెయ్యలేనా?" ధీమాగా చెప్పింది.

"ఆహాహా! చూడ్రా నాయినా మీ అమ్మ ధీమా." ఎగతాళి చేశాడాయన.

"మా అమ్మకేం నాన్నా వాళ్ళివ్వాలేకానీ, దివ్యంగా చేసేస్తుంది. అంతదాకా ఎందుకు? ఆర్థిక శాఖ మా అమ్మకి ఇస్తేనా? దేశం మూడ్రోజుల్లో బాగుపడి పోతుంది." తల్లినే సమర్థించాడు మనోహర్.

ఆవిడ నిజంగా గొప్పదే. కొడుకు చెప్పినట్లు దేశ ఆర్థిక శాఖను నిర్వహించేటంత ఘనత లేకపోయినా తన కుటుంబం మటుకు చక్కగా చూసుకుంటుంది. కొంత డబ్బు తీసి ఆవిడ చేతుల్లోనే పెట్టుకుంటుంది. అందులోనే సంసారం నడిపి ఎంతో కొంత దాచి ఉంచుతుంది. ప్రాణవసరం వచ్చినప్పుడు తీసి వాడుతుంది. అలా అని చీటికీ మాటికీ అడిగితే నాలిక పీక్కున్నా నయాపైసా ఇవ్వదు. ఇంట్లో వాళ్లందరికీ అదో ధైర్యం.

"బేంకుల్లోనైనా డబ్బు ఖాళీ అయిపోతుందేమో కానీ, మా అత్తగారి దగ్గర డబ్బు లేకుండా ఉండదు" అంటుంది ఆవిడ కోడలు.

ఆవిడ గొప్పదే అయినా కొడుకు సమర్థించడం ఆయనికి అంతగా నచ్చలేదు.

"ఆc! నా మొహంలే!ఏళ్ళ తరబడీ చేసి చేసి అలవాటైపోయింది మీ అమ్మకి. డబ్బు చేతుల్లో పెట్టుకుని సంసారం గడపడం ఓ గొప్పా.! అసలిదంతా నా కోడలి గొప్పతనం. ఆ అమ్మాయి మంచిది, కాబట్టి ఇంకా ఈవిడ పెత్తనం సాగుతోంది. లేకపోతే ఈపాటికి అంతా హస్తగతం చేసుకుని నిన్ను మూల కూర్చోబెట్టేది" అన్నాడు.

మాటల్లోనే వచ్చింది విష్ణుప్రియ. "ఏమిటి మామయ్యగారూ, నా గురించే మాట్లాడుకుంటున్నట్లున్నారే?"

"రామ్మా రా! మాటల్లోనే వచ్చావు. నిండా నూరేళ్ళు. తల్లీ కొడుకు ఏకం అయిపోయి స్వంత డబ్బాకొట్టుకుంటున్నారు" అంటూ మొదలు పెట్టిన భర్తని వారించింది జానకమ్మ.

"ఇంట్లోకి రావడం ఆలస్యం, మొదట కాస్త ఊపిరి పీల్చుకోనివ్వండి" అంటూ లేచి వెళ్ళి కాఫీ తీసుకొచ్చింది.

కాఫీ అందుకుని గోడకు చేరబడి కూర్చుంది విష్ణు. "అబ్బ, పొద్దుటినుంచి కాళ్ళు ఒకటే నెప్పులు. దానికి తోడు మా కొలీగ్ రాలేదు. ఇద్దరి పనీ నా నెత్తినే పడింది. బస్‌లో కూడా సీట్ దొరకలేదు. విపరీతమైన రష్. అక్కడినించి ఇక్కడిదాకా నిలబడే ఉన్నాను" అంటూ కాళ్ళు చాపుకుంది.

కోడల్ని చూస్తే జాలేసింది ఆవిడకి. "అయ్యో పిచ్చిపిల్లా!" కాళ్లకి ఏమైనా రాయనా? నీళ్ళు పెడతాను, వేడిగా స్నానం చెయ్యి తగ్గిపోతుంది" అంది ఆదరంగా.

భార్యని ఏడిపించ బుద్ధివేసింది మనోహర్‌కి. "అసలా ఫోజు చూడు, పెద్ద శ్రమపడిపోతున్నట్లు ఆపసోపాలు. అమ్మ దగ్గర ఇంకాస్త గారాలు పోవచ్చని ఎత్తు. నేను మాత్రం వెళ్ళి రాలేదా! చూడు ఎంత ఫ్రెష్‌గా ఉన్నానో" అన్నాడు.

విష్ణుకి కోపం వచ్చింది. "మీలాగా గవర్నమెంటు ఉద్యోగం అయితే నేనూ కడిగిన ముత్యంలా ఫ్రెష్‌గా ఉండేదాన్ని. నాది ప్రైవేటు నౌకరీ. చచ్చినట్లు పని చెయ్యాలి" అంది. మనోహర్‌కి కోపం వచ్చింది. "అవును పాపం. మాకు పనీ పాడూ ఉండవు. వెళ్ళగానే రిజిస్టర్‌లో సంతకం పెడతాం. ఆ వెంటనే మా బాస్ పిలిచి తలో కాసిని గోలీలు ఇస్తాడు. ఆడుకుంటూ కూర్చుంటాం."

"ఉన్న మాట అంటే వులుకెందుకురా అబ్బాయ్? గోలీలు కాకపోతే కబుర్లాడుకుంటారు. ఇంటికి బారెడు దూరంలో ఆఫీసు. చీటికి మాటికీ వచ్చిపోతూనే ఉంటావ్. ఇంతోటి భాగ్యానికి స్కూటరు. పాపం, విష్ణు. బస్సుల్లో పడి పోవాలి.

తలెత్తకుండా చాకిరి చెయ్యాలి. ఈసురోమంటూ ఇంటికి రావాలి. ఆడపిల్ల ఇంత హైరాన పడితే అలసిపోదూ?" కోడలినే సమర్థించింది జానకమ్మ.

ఆవిడ అటు వెళ్ళేసరికి కొడుకు పక్షాన చేరి పోయాడు రామారావు.

"అత్తాకోడళ్ళు ఏకమై వాడిమీదికి దండెత్తారు కానీ, వాడి బాధ మీకేం తెలుసు? ఉద్యోగంలో చేరి పన్నెండేళ్ళు అయింది. అప్పటికీ ఇప్పటికీ అదే ఉద్యోగం. అదే కుర్చీ. అదే బల్ల. ఓ ప్రమోషనూ లేదు, పాడూ లేదు. అయినా, ఆ ఉద్యోగాన్ని పట్టుకుని వేలాడుతున్నాడు వెర్రితండ్రి. భూదేవికి ఉన్నంత ఓర్పు ఉంది వాడికి. వాడిని చూసి వాళ్ళాఫీసరు తెగ ముచ్చట పడిపోతాడట. 'ఎంత మంచివాడవయ్యా మనోహరూ! ఎంచక్కా రోజు ఆఫీసు కొస్తావు' అని ఆనందపడిపోతాడట. మీకంటే లోకువ అయిపోయాడు కానీ, వాడికి అక్కడ చాలా మంచి పేరుంది" కొడుకుని సమర్థించాడు. నా కొడుకు గొప్ప అంటే నా కోడలు గొప్ప అని ఇద్దరూ వాదించుకున్నారు.

ఈ సందట్లో తన అలసట మరిచిపోయింది విష్ణు. లేచి మొహం కడుక్కుని, బట్టలు మార్చుకుని, జడ వేసుకుని, మల్లెపూలు పెట్టుకుని ఫ్రెష్‌గా తయారైపోయింది. సాయంత్రం వంట డ్యూటీ ఆవిడదే. జానకమ్మ వద్దన్నా వినదు. తనే చేస్తుంది. అసిస్టెంటు మామగారు.

ఇద్దరూ కలిసి పెరట్లోకి వెళ్ళి వంకాయలు కోసుకొచ్చారు. "తోటకూర పప్పు వండుతాను మామయ్యగారూ!" అంది విష్ణు. అది కూడా కోసి ఇచ్చాడాయన. వంటింట్లో చేరి కబుర్లలో పడ్డారు ఇద్దరూ.

"ఇవాళ ఆవిడ దగ్గరికి వెళ్ళాను మామయ్యగారూ! మనం అనుకున్న ధరలో లేవు. మరో వారం రోజుల్లో వస్తాయట" అంది గుసగుసగా.

"ఫర్వాలేదులే అమ్మా ఇంకా నెల్రోజులుందిగా" అన్నాడాయన గుసగుసగా. భార్యకి ఓ పట్టుచీరె కొనాలని ఆయన ఆశ. కోడలి దగ్గర డబ్బు దాచుకుంటున్నాడు. అయిదేళ్ళుగా ప్రయత్నిస్తూన్నా కుదరడం లేదు. నానా అవస్థా పడి ఈయన డబ్బు సమకూర్చేసరికి బజార్లో ధరలు పెరిగి పోతున్నాయి. పై నెల్లో ఆవిడ పుట్టినరోజు. అప్పటికీ ఎలాగైనా కొనాలని గట్టి పట్టుదల పట్టాడు. కోడలు సహకరించింది. తెలిసినావిడ ఎవరో ఇన్‌స్టాల్‌మెంట్ మీద చీరలు ఇస్తున్నారంటే వెళ్ళి కనుక్కుని వచ్చింది. ప్రస్తుతం ఉన్నది ఇచ్చేసి. మిగిలింది తర్వాత ఇచ్చేలా ఏర్పాటుచేసింది. చివరిదాకా ఆవిడతో చెప్పకూడదని గూడుపుఠాణి చేస్తున్నారు మామాకోడళ్ళు.

మామగారి సాయంతో వంట ముగించింది విష్ణు. కుక్కర్ మూడో విజిల్ వేసేసరికి హోలోమంటూ వచ్చారు దినకర్, పవన్.

పవన్‌గాడి నోట్లో విజిల్ ఉంది. రెండు చేతుల్లోనూ బెలూన్లు ఉన్నాయి. మహా ఉత్సాహంగా ఉన్నాడు. పిపీమని విజిల్ ఊదుకుంటూ వచ్చేశాడు. వాడి వెనకాల బాబాయి నీరసంగా వచ్చాడు. "ఏమిట్రా ఇంతాలస్యం అయిందేం? ఏమన్నది టీచర్? ఎలా ఉందట వీడి చదువు?" అందరూ చుట్టుముట్టి ప్రశ్నల వర్షం కురిపించారు.

"చెప్తాను కాస్తాగండ్రా" విసుకున్నాడు దినకర్.

ఆ వేళ పవన్ కాన్వెంట్‌లో పేరెంట్ – టీచర్ మీటింగ్ అంతకు కొద్ది రోజుల ముందు జరిగిన పరీక్షల మార్కులు ఇచ్చి మీ పిల్ల / పిల్లాడు ఎలా చదువుతున్నారో చెప్తాం రమ్మని శ్రీముఖం పంపించారు స్కూలు వాళ్లు. పవన్‌గాడిని చదివించే గురుతర బాధ్యతను నిర్వర్తిస్తున్న పినతండ్రి వాడిని వెంటబెట్టుకుని వెళ్ళాడు.

"ఎలా ఉంది వీడి చదువు?"

"అఘోరించినట్లుందట. ఆ టీచరు పాపం, నాతో చెప్పుకొని బాధపడింది. చదువుకోకపోతే పోనీ సీట్లో తిన్నగా కూర్చుంటే చాలు. నా జన్మ ధన్యం. ఎంతసేపూ బల్లలు ఎక్కి దూకడం, అందర్నీ పీకడం, రక్కడం ఏమైనా అంటే ఏడూళ్ళు వినిపించేలా ఏడుస్తాడు. హెడ్‌మిస్ట్రెస్ పరిగెట్టుకుంటూ వచ్చి నన్ను చీవాట్లు వేస్తుంది 'రాక రాక వచ్చిన ఉద్యోగం. వీడి ధర్మమా అని ఎక్కడ ఊడిపోతుందో అని భయంగా ఉందండీ నాకు' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది."

ఉసూరుమన్నారు శ్రోతలు. "అల్లరి సరే. చదువెలా ఉందట? మొన్న పరీక్షల్లో ఎలా చేశాడట?" ఆశగా అడిగింది విష్ణు.

"అత్యద్భుతంగా చేశాడు. వీడి క్లాసులో నలభై మంది ఉన్నారు. తెలుసుగా. మనవాడిది ముప్పై తొమ్మిదో రేంకు."

దిగాలు పడిపోయాడు మనోహర్. "చూశారా నాన్నా నా సుపుత్రుడికి ముప్పైతొమ్మిదో రేంకు వచ్చిందట. ఏం చెయ్యను నేను?"

"ఆ నలభైయవ రేంకు వచ్చినవాడి తండ్రి దగ్గరకు వెళ్ళి మందలించి రా. ఇలా అయితే లాభం లేదయ్యా. ఇదేనా పిల్లాడిని చదివించే పద్ధతి అని గట్టిగా అడిగి కాసిని సలహాలు చెప్పిరా."

"మీ సలహా బాగానే ఉంది. కానీ, వీడిలా చదివేడిస్తే ఎలా? అసలే బోలెడంత కాంపిటీషను."

"వాడి మొహం. వాడి వయసెంత? వేలెడు వెధవని తీసుకెళ్ళి బళ్లో పారేసి చదువు, చదువు అని చంపుకు తింటే వాడేం చేస్తాడు? అసలు వాడికేం తెలుసు? చదువంటే ఏమిటో, ఎందుకు చదువుకోవాలో గ్రహించే వయసు వస్తే వాడే చదువుకుంటాడు" ధైర్యం చెప్పాడాయన.

అసలిదంతా తనకు సంబంధించిన విషయం కాదన్నట్లు బెలూన్లు ఎగరేసుకుంటూ ఆడుకుంటున్న పవన్‌ని చూస్తే కోపం వచ్చింది మనోహర్‌కి.

"ఈ బెలూన్ల అట్టహాసం చూసి పరీక్షల్లో బాగా చేశాడేమో అనుకున్నా, ఇంతోటి భాగ్యానికి ఈ సెలబ్రేషన్ ఎందుకురా?" తమ్ముడిని మందలించాడు.

"సెలిబ్రేషన్ కాదు. అక్కడి నించి మాధవరావు గారింటికి వెళ్తూంటే దార్లో కనిపించాడు బెలూన్లవాడు. వీడు మొర్రోమంటూ గోల. కొనిస్తే కానీ కదలనని బెదరిస్తే కొనిపెట్టాను" చెప్పాడు దినకర్.

"ఇంతకీ వెళ్ళావా మాధవరావు గారింటికి? ఏమైంది నీ ఉద్యోగం విషయం?" మాట మార్చింది జానకమ్మ.

"వెళ్ళాను. ఆయన ఊళ్ళో లేడట. ఎప్పుడొస్తాడో ఇంట్లో వాళ్ళకే తెలియదట. ఎందుకొచ్చిన గొడవ! నాకు ఉద్యోగమూ రాదు, వీడికి చదువూ రాదు. రెండు గేదెలు కొనుక్కుని పాల వ్యాపారం చేసుకుని బ్రతుకుతాం ఇద్దరం!" అన్నాడు దినకర్.

"ఓ, దానికేం భాగ్యం, అలాగే. ఇంకా నాల్రోజులు పోయాక అదే చేద్దాం" హామీ ఇచ్చాడు రామారావు.

"ప్రస్తుతానికి హాయిగా కేరమ్స్ ఆడుకుందాం పదండి" అంటూ అందరినీ లేవదీశాడు. రామారావు, విష్ణు ఒక పార్టీ. జానకమ్మ, మనోహర్ ఒక పార్టీ. దినకర్ ప్రేక్షకుడు.

ఆట మధ్యలో ఉండగా పవన్ పరిగెత్తుకుంటూ వచ్చాడు. వాడి వెనకాల మరోపది మంది పిల్లలు. పవన్ మొహం గర్వంతో వెలిగిపోతోంది. "నేను చెప్తే నమ్మలేదుగా! కావలిస్తే మీరే అడగండి" అన్నాడు. "ఏమండీ మీరు గేదెలు కొనుక్కుంటారా?" అడిగాడో పిల్లవాడు.

తనూ, బాబాయీ కలిసి గేదెలు కొనుక్కుంటామనే సరికి బలే సరదాగా అనిపించింది పవన్‌కి. వెంటనే వెళ్ళి తన ఫ్రెండ్స్ అందరితోనూ చెప్పేశాడు. వాళ్ళు నమ్మలేదు. పోవోయ్ అన్నారు. పవన్‌కి కోపం వచ్చింది. వాడి కసలే చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. ఆ వీథిలో స్కూటర్లు కొనుక్కున్నవాళ్ళున్నారు. టి.వి కొనుక్కున్న వాళ్ళున్నారు. కానీ, గేదెలెవరూ కొనుక్కోలేదు. ఎవరూ చెయ్యని పని తాను చేస్తుంటే ఎవరూ నమ్మకపోవడం వాడికేం నచ్చలేదు. అందుకే అందర్నీ వెంటేసుకుని తీసుకొచ్చాడు.

"పవన్ చెప్పాడు. నిజంగా మీరు గేదెలు కొనేసుకుంటున్నారా అంకుల్!" సంభ్రమంగా అడిగాడు ఇంకో పిల్లాడు.

నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు దినకర్‌కి.

"ఖచ్చితంగా ఏమీ తేల్చుకోలేదర్రా, కొనగానే మిమ్మల్ని పేరంటం పిలుస్తాం!" హామీ ఇచ్చాడు. వాళ్ళంతా కాసేపు ఇంటిన పడి ఆడుకుని, ఇల్లు పీకి పందిరేసి పోయారు. భోజనాలు ముగించి పక్కలు వేసుకున్నారు. రామారావు, జానకమ్మ దినకర్ ఆరుబయటే పడుకుంటారు.

"జాగర్త నాన్నా, ఈమధ్య దొంగతనాలు జరుగుతున్నాయట" అన్నాడు మనోహర్.

"మనింట్లో ఏం ఉన్నాయని దొంగలు పడతారురా?" ఎదురు ప్రశ్న వేశాడు. "అది కాదు నాన్నా. బయట పడేసి ఉన్న బక్కెట్లూ చెంబులూ ఇవేమీ లేకపోతే పంపు తలకాయలూ ఎత్తుకుపోతున్నారట".

"మనం వస్తువులన్నీ లోపలే పడేస్తున్నాంగా. పంపు తలకాయంటావా – రోజుకి ఓ గంట మాత్రమే నీళ్ళొచ్చే పంపుకి తలకాయ లేకపోతే వచ్చే నష్టం ఏమీ లేదు కానీ, నువ్వు పోయి పడుకో" ధైర్యం చెప్పి పంపించాడు రామారావు.

తెల్లవారింది. అష్టావధానం. అందరికీ హడావుడి. తొందర. కాఫీలు, టిఫిన్లు కావాలి. అన్నం వండాలి. స్నానాలు, అప్పుడే బట్టలు ఇస్త్రీ చేసుకోవడం అప్పుడే పంపులో నీళ్ళు వస్తాయి. పట్టుకోవాలి. అంతా గాభరా పరుగులు, యమదూతలొచ్చినా కాసేపు ఆగి రండి నాయనా అని చెప్పాల్సిందే.

ఆ సమయంలో సామాన్యంగా ఎవరూ ఎవరిళ్ళకూ వెళ్ళరు. మరీ అత్యవసరం అయితే తప్ప. కానీ, గోవిందరావుది మాత్రం అదే టైమ్. ఎప్పుడొచ్చినా అదే వేళ్టికి వస్తాడాయన.

గోవిందరావు విష్ణుప్రియ పినతండ్రి. ఆయనదీ వీళ్ళలాటి సంసారమే. ఇద్దరు కూతుళ్ళకీ కొడుక్కీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఇంకో కొడుకు ఉన్నాడు. ఇంట్లో వాళ్ళమీద దెబ్బలాడి అలిగి ఏ బంధువులింటికో పోయి తన బాధంతా వాళ్ళతో చెప్పుకుని, వాళ్ళ సానుభూతి పొంది ఇంటికి పోతాడు. ఆవేళ కూడా ధుమధుమలాడుతూ వచ్చాడు.

ఆదరంగా ఆహ్వానించాడు రామారావు. అందరూ వచ్చి పలకరించారు.

"ఏమిటో జీవితం మీద విరక్తి పుడుతోంది. చావుకూడా కనికరించడం లేదు. – మరీ కుక్క బ్రతుకైపోయింది" విసుగ్గా చెప్పాడాయన.

అందరూ మొహమొహాలు చూసుకుంటూ ఉండి పోయారు. "కాస్త కాఫీ తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళి కాఫీ తెచ్చి అతిథికి ఇచ్చింది జానకమ్మ. "మీకు కావాలా?" అని భర్తను అడిగి ఆయనకీ తెచ్చి అందించింది.

అది చూసి మరింత బాధపడిపోయాడు గోవిందరావు.

"మీ వదినకు కాస్త గడ్డి పెట్టరాదటమ్మా నువ్వు. నిన్ను చూసైనా బుద్ధి తెచ్చుకుంటుందేమో. నువ్వు చూడు బావగారిని ఎంత బాగా చూసుకుంటావో దానికామాత్రం జ్ఞానం లేదే. పూచికపుల్లలా చూస్తుంది. చీటికి మాటికి పిల్లల ముందే కసిరి కొడుతుంది. ఇక వాళ్ళకి నామీద ఏం గౌరవం ఉంటుంది?

"ఇక నా కొడుకు ఉన్నాడంటే ఉత్త చవట వెధవ. పెళ్ళాం కొంగు పుచ్చుకుని తిరగడం తప్ప ఇంకేమీ చేతకాదు. దాని మాటకి డూడూ అంటూ తలూపుతూ ఉంటాడు".

అంతా విని నవ్వేశాడు రామారావు. "అందులో వింత ఏం ఉంది బావగారూ! అది లోక సహజం. పెళ్ళయ్యాక పెళ్ళాం కొంగు పట్టుకుని తిరగక మీ వేలు పట్టుకొని తిరుగుతాడా? అందరూ అంతే. ఆ మాటకొస్తే నా కొడుకు మాత్రం గొప్ప విష్ణుభక్తుడు కాడూ!" అన్నాడు.

మనోహర్ విష్ణు వంక చూసి చిలిపిగా నవ్వాడు. సిగ్గుపడుతూ లోపలకి పారిపోయింది విష్ణు.

"అది కాదండీ!" మళ్ళీ మొదలుపెట్టాడాయన.

"మీ చెప్పులు బలే బావున్నాయండీ! ఎక్కడకొన్నారు! నేనూ మా నాన్నగారికి కొంటాను" సంభాషణ మార్చడానికి అడిగాడు మనోహర్.

"ఏమిట్రా ఆ పిచ్చి ప్రశ్నలూ! ఎక్కడ కొన్నారు ఏమిటీ అంటూ? రేపు మనవాళ్ళింట్లో పెళ్ళికి బావగారూ వస్తారు. నేనూ వెళ్తాను. సమస్య తీరిపోలా?" కొడుకుని మందలించాడు రామారావు.

ఆ జోక్‌కి మనోహర్‌తో పాటు గోవిందరావు నవ్వేశాడు. "బలేవారు బావగారూ మీరు!" అన్నాడు.

ఆయన మూడ్ కాస్త మారడంతో అంతా తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. టిఫిన్లు, కాఫీలు అయాయి. విష్ణు, మనోహర్ తయారైపోయారు. పవన్‌ని కూడా రెడీ చేసేశారు.

రామారావుకీ, జానకమ్మకీ చెప్పి ఒక్కొక్కరే వెళ్ళిపోయారు.

వాళ్ళటు వెళ్ళగానే మళ్ళీ పురాణం విప్పాడు ఆయన. చెప్పిందే చెప్పి ఊదరగొట్టేశాడు. ఆయన ధోరణి అంతే. గంటల తరబడి చెప్పుకుంటూ పోతాడు. ఆ మాటల పర్యవసానం ఒక్కటే. 'నాది వెధవ జీవితం. నాకు చావెప్పుడొస్తుందా?' అంతా వింటూ లోలోపలే నవ్వుకున్నాడు రామారావు.

ఆయన్ని రక్షించడానికా అన్నట్లు లోపలి నించి వచ్చింది జానకమ్మ. చేతుల్లో రేషనుకార్డూ, సంచులు. "పెందలాడే వెళ్ళొస్తే జనం ఉండరు. తొందరగా వెళ్ళండి" అని పురమాయించింది.

లేచి షర్టు వేసుకున్నాడు రామారావు. "మీరు కూర్చోండి బావగారూ! నేను వెళ్ళి త్వరగా వచ్చేస్తాను" అన్నాడు. "లేదు లెండి, నేనూ వెళ్తాను. ఇంకా స్నానం చట్టుబండలూ ఏమీ కాలేదు. అక్కడిదాకా మీతో వచ్చి అలాగే కొంపకి తగలడతాను" అంటూ లేచాడు గోవిందరావు.

జానకమ్మ వాకిలిదాకా వచ్చింది. "వచ్చేటప్పుడు ఆటోలో రండి" అని భర్తతో చెప్పింది.

రామారావు, గోవిందరావు రోడ్డు మీదికి వచ్చారు. "ఎలాగైనా మీరు చాలా అదృష్టవంతులు బావగారూ! ఏ సమస్యలూ లేని జీవితం మీది!" అన్నాడు గోవిందరావు, కించిత్తు అసూయగా.

ఫకాల్న నవ్వేశాడు రామారావు. "ఎవరు చెప్పారండీ మీతో నాకు సమస్యలు లేవని? అందరికీ ఉండే సమస్యలన్నీ నాకూ ఉన్నాయి. మళ్ళీ చెప్పాలంటే మరికాస్త ఎక్కువగానే ఉన్నాయి.

“మా ఇంట్లో మా జీతాలు రావడానికి వారం రోజుల ముందే లక్షణంగా డబ్బులు అయిపోతాయి. కటకటలాడి పోతాం. తెల్లవారి లేస్తే ఎదురయే నీళ్ళ సమస్యలు. పాల సమస్యలు, కరెంటు సమస్యలు, మండిపోయే ధరల సమస్యలు అందరితో పాటే మాకూను.

“ఈ చిన్నా చితకా సమస్యలు అలా ఉంచితే భూతాల వంటి సమస్యలు బోలెడు. మా కోడలిని ఇష్టపడి పెళ్ళి చేసుకున్నాడు మా అబ్బాయి. మీకు తెలుసుగా – మీ అన్నగారి పరిస్థితి. కట్నం ఏమీ ఇవ్వలేకపోయాడాయన. కానీ నా కూతురికి అలా కుదరలేదు. కట్నం ఇవ్వాల్సివచ్చింది.

“ఏదో కొంత మాత్రమే నేను ఇవ్వగలిగాను. మిగిలినదంతా కొడుకు, కోడలే అప్పు తెచ్చి ఆ శుభకార్యం అయిందనిపించారు. అప్పు తీరడానికి అయిదేళ్లు పట్టింది. ఆ అయిదేళ్ళు అన్ని సరదాలూ, ఆఖరికి పిల్లలని కనడం కూడా వాయిదా వేసి రెక్కలు ముక్కలు చేసుకున్నారు. చిలకా గోరింకల్లా తిరగవలసిన నూతన దంపతులు డబ్బు కోసం గానుగెద్దుల్లా పాటుపడుతూ ఉంటే చూసి సహించడం తప్ప మరేమీ చెయ్యలేక ఊరుకున్నాను.

“నా మనవడికి స్కూల్లో సీటు కోసం నానా తంటాలూ పడి వెయ్యి రూపాయలు డొనేషన్ కట్టి కాన్వెంట్‌లో చేర్పిస్తే వాడు ఆఖరి నించి రాంకులో వస్తున్నాడు.

“నా చిన్నకొడుకు డిగ్రీ పాసయి ఏడాది దాటింది. ఇంకా నికరమైన ఉద్యోగం రాలేదు. దొరికేవన్నీ తుమ్మితే ఊడిపోయే ఉద్యోగాలు. నెల మధ్యలో పీకి పారేసే పుణ్యాత్ముడు ఒకడైతే, నెలంతా చాకిరీ చేయించుకుని జీతం ఇవ్వని ధర్మాత్ముడు మరొకడు. ఎలాగైనా మంచి ఉద్యోగం చూసుకోవాలని పిచ్చివాడిలా తిరుగుతున్నాడు.

“నా భార్య ఒంటిన పది తులాల బంగారం పెట్టుకుని, వెంట వంద తులాల వెండి తీసుకుని నావెంట కాపురానికి వచ్చింది. ఈనాడు పుస్తెల తాడు తప్ప ఇంకేమీ లేవు. ఇంతకీ నేను చెప్పొచ్చేది ఏమిటంటే, సమస్యలకు ఏ కొరతా లేదు నాకు. అసలీ సమస్యలున్నాయే – అవి బలే తమాషాగా ఉంటాయి. వాటికి భయపడితే భూతాల్లా వెంటబడి పీడిస్తాయి. ఓస్ – ఇవి మనని ఏం చేస్తాయి అని తీసిపారేస్తే దూదిపింజల్లా ఎగిరిపోతాయి.

“అందుకే వాటిని లెక్కచెయ్యం మేము. ప్రతి సమస్యనీ తమాషాగా తీసిపారేస్తాం. నవ్వుతూ ఆనందంగా బ్రతుకుతున్నాం. మా ఇంట్లో ఒకరిపట్ల మరొకరికి

అనురాగం తప్ప ద్వేషాలు లేవు. బ్రతికిన నాలుగు రోజులు సుఖంగా, సంతోషంగా బ్రతకాలన్నదే మా జీవిత లక్ష్యం.

"మాకున్న ఒక్క గదీ, వంట ఇల్లూ మా పాలిట దేవేంద్ర భవనం. తినేది చారు అన్నమే అయినా తృప్తిగా తింటాం. చాపమీదే అయినా కంటి నిండా నిద్రపోతాం"

మాట్లాడుతూనే సెంటరుదాకా వచ్చేశారు. అక్కడి నుండి ఇద్దరి దారులూ వేరు.

"ఇదే అదృష్టం అని మీరు భావిస్తూ ఉంటే, ఈ అదృష్టాన్ని స్వంతం చేసుకోవడం మీ చేతుల్లోనే ఉంది. మీకో విషయం తెలుసా బావగారూ? నవ్వుతూ అనుభవించేవాడి దగ్గరకు ఏడుస్తూ అనుభవించే వాడు పరిష్కారం కోసం వస్తాడట. వస్తాను మరి. మళ్ళీ ఎండెక్కితే హనుమంతుడి తోకలా తయారవుతుంది రేషన్ క్యూ" అంటూ చకచక నడుస్తూ వెళ్ళిపోతున్న రామారావు వంక చూస్తూ ఉండిపోయాడు గోవిందరావు.

*ఇండియా టుడే జూన్ 1991*